నిరుద్యోగుల నిరీక్షణ

భృతి కోసం ఎదురుచూపులు • జాబ్ క్యాలెండర్‌పై గంపెడాశలు

సూపర్ సిక్స్ పేరుతో నిరుద్యోగులకు పెద్దపీట వేస్తున్నామని, ఇంటికో ఉద్యోగం వచ్చేవరకు ప్రతి ఒక్కరికీ రూ.3000 నిరుద్యోగ భృతి ఇస్తామని సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీ అధినేత చంద్రబాబు చేసిన ప్రకటన అమలు కోసం నిరుద్యోగులు ఎదురు చూస్తున్నారు. ఒకపక్క జాబ్ క్యాలెండర్ లేక, మరో పక్క నిరుద్యోగ భృతి అమలు కాకపోవడంతో ఆవేదన చెందుతున్నారు. భృతి ఎప్పటినుంచి ఇస్తారో స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

గాజువాక/పెదగంట్యాడ: నిరుద్యోగ భృతి కోసం యువత నిరీక్షిస్తున్నారు. ఇంటికో ఉద్యోగం అంటూ ఊదరగొట్టి, అంతవరకు నిరుద్యోగ భృతి ఇస్తామని ఆశలు రేకెత్తించారని.. అధికారంలోకి వచ్చి నెల దాటినా ఈ విషయం ముఖ్యమంత్రి మాట్లాడటం లేదని ఆందోళన చెందుతున్నారు. నిరుద్యోగుల మద్దతుతో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రస్తుతం భృతి విషయం పట్టించుకోవడం లేదంటూ పలువురు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చంద్రబాబు ప్రకటన ప్రకారం నియోజకవర్గంలో సుమారు 30 వేల మందికి నిరుద్యోగ భృతి ఇవ్వాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. చంద్రబాబు హామీలను నమ్మి ఓట్లు వేశామని, హామీలను వెంటనే అమలు చేయాలని వారు కోరుతున్నారు. జాబ్ క్యాలెండర్‌ను కూడా విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి



నిరుద్యోగ భృతి అమలుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. గతంలో మాదిరిగా కాకుండా తక్షణమే భృతిని ప్రకటించాలి. జాబ్ క్యాలెండర్ అమలుపై కూడా ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలి. నోటిఫికేషన్ ఒక్కనెల ఆలస్యమైనా లక్షలాదిమంది నిరుద్యోగులు వయోపరిమితి దాటిపోయి ప్రభుత్వ ఉద్యోగానికి అర్హత కోల్పోతారు. – గొలగాని నందగోపాల్, పాతగాజువాక

తక్షణం అమలు చేయాలి



జనరల్ అభ్యర్థులతో సహా అందరికీ నిరుద్యోగ భృతి తక్షణం అమలు చేయాలి. ప్రభుత్వ ఉద్యోగం వచ్చేవరకు రూ.3000 భృతి ఇస్తామన్నారు. ఇప్పటివరకు దాని ఊసే ఎత్తలేదు. గతంలో మాదిరిగా నిరుద్యోగులను దయచేసి మోసం చేయకండి. ఉద్యోగాలపై ఎన్నో ఆశలు పెట్టుకున్నాం. – కె.షణ్ముఖ్, గాజువాక

జాబ్ క్యాలెండర్ విడుదల చేయాలి



నిరుద్యోగ భృతి హామీని అమలు చేయడంతో పాటు జాబ్ క్యాలెండర్‌ను కూడా వెంటనే విడుదల చేయాలి. నోటిఫికేషన్ కోసం లక్షలాదిమంది నిరుద్యోగులం గంపెడాశతో ఉన్నాం. కానీ, దాని గురించి ఈ ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టుగా లేదు. భృతి అమలు, జాబ్ క్యాలెండర్ విడుదలపై ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలి. – కొయ్యన కృష్ణ, శ్రీనగర్

నిరుద్యోగుల ఊసే ఎత్తడంలేదు



ప్రభుత్వం ఏర్పడి నెల దాటిపోయినా నిరుద్యోగుల ఊసెత్తకపోవడం దారుణం. ప్రభుత్వ ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగ భృతి ఇస్తామని గొప్పగా చెప్పారు. ఇప్పుడు దాని గురించి కనీసం మాట్లాడటం లేదు. ఈ హామీని అమలు చేసే ఉద్దేశం ప్రభుత్వానికి ఉందో, లేదో అర్థం కావడంలేదు. – జి.షణ్ముఖ మధు, అఫీషియల్ కాలనీ

ప్రభుత్వం స్పందించాలి



చదువులు పూర్తయి, ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాం. ఎన్నికల ముందు టీడీపీ, జనసేన పార్టీలు లక్షలాది ఉద్యోగాలు భర్తీ చేస్తామని, నిరుద్యోగ భృతి ఇస్తామంటూ ఆశలు రేకెత్తించారు. వెంటనే ప్రభుత్వం స్పందించాలి. స్పష్టమైన ప్రకటన చేయాలి. – గొండేశి నాగిరెడ్డి, పాత అయ్యన్నపాలెం

సెయిల్‌లో స్టీల్‌ప్లాంట్ విలీనానికి సహకరించండి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేసేందుకు సహకరించాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు రాజమండ్రి ఎంపీ, బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరిని కోరారు. సోమవారం విశాఖ వచ్చిన పురందేశ్వరిని నగర బీజేపీ కార్యాలయంలో కలిసిన వారు ఈ మేరకు వినతిపత్రం అందజేశారు.దీనిపై పురందేశ్వరి మాట్లాడుతూ ఈ అంశాలపై కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి హెచ్‌డీ కుమారస్వామి, సహాయమంత్రి శ్రీనివాసవర్మలతో చర్చిస్తున్నామన్నారు.ప్రధాని దృష్టికి తీసుకు వెళ్లి సమస్యలను పరిష్కరిస్తామని ఆమె హామీ ఇచ్చినట్టు పోరాట కమిటీ నాయకులు తెలిపారు. అనంతరం సెయిల్ స్వతంత్ర డైరెక్టర్ కాశీ విశ్వనాథరాజును కలిసి ప్లాంట్ పరిస్థితిని, సెయిల్‌లో విలీనం ఆవశ్యకతను తెలియజేశారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, యు.రామస్వామి, డి.అప్పారావు, బొడ్డు పైడిరాజు, రామ్మోహన్‌కుమార్, వరసాల శ్రీనివాస్, కె.శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.


పురందేశ్వరికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని విజ్ఞప్తి

గాజువాక: తమకు కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలని, రైస్ కార్డులను ఇవ్వడంతో పాటు వైద్య సౌకర్యం కల్పించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ నాయకులు కోరారు. ఈ మేరకు వారు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును సోమవారం కలిసి వినతి పత్రం అందజేశారు. రైల్వే చార్జీల్లోను తమకు రాయితీ కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు. తాము కేవలం పెన్షన్‌పైనే ఆధారపడి జీవిస్తున్నామని పేర్కొన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో నాయకులు వర్మ, రమణారెడ్డి, కె.దీనబంధు, హుస్సేన్, కణితి అప్పలరాజు, పిట్టా గుర్నాథ్ తదితరులున్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

గాజువాక: విద్యార్థులు తాము చదువుకుంటున్నప్పటి నుంచే చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఎనిమిదో అదనపు జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ వై.శ్రీలక్ష్మి అన్నారు. స్థానిక డిఫెన్స్ అకాడమీలో సోమవారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ఆమె ప్రసంగించారు. విద్యార్థులు నేర ప్రవృత్తికి దూరంగా ఉండాలని, అది భవిష్యత్తుకు బంగారు బాట వేస్తుందని అన్నారు. కార్యక్రమంలో గాజువాక బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.ప్రభాకరరావు, మాజీ కార్యదర్శి బీవీఎం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సదస్సులో ప్రసంగిస్తున్న న్యాయమూర్తి శ్రీలక్ష్మి

అక్రమ నిర్మాణంపై చర్యలకు వినతి

మహారాణిపేట: గాజువాక మెయిన్‌రోడ్డు నుంచి గాంధీనగర్ మీదుగా జోగవానిపాలెం వెళ్లే 30 అడుగుల రోడ్డులో అనధికార భవన నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని ప్రజా హక్కుల పోరాట సమితి గాజువాక అధ్యక్షుడు, బీసీ సంఘ ప్రతినిధి పి.యుగంధర్ కోరారు. సోమవారం ప్రజా హక్కుల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఆ తర్వాత ఆర్డీవో హుస్సేన్ సాహెబ్‌ను కలిసి భవన యజమాని నకిలీ సర్వే నంబర్‌తో అనుమతులు తీసుకొని రహదారిని ఆక్రమించారని వివరించారు. ఈ అక్రమ నిర్మాణం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, గాజువాకలోని వివిధ శాఖల అధికారులు అతనికి అండగా ఉన్నారని యుగంధర్ ఆరోపించారు.

'ఉక్కు' జీఎం సంజీవరావు సేవలు నిరుపమానం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ (ఐఆర్) జనరల్ మేనేజర్ కంచర్ల సంజీవరావును స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు ఘనంగా సత్కరించారు. సంజీవరావు ఈ నెలాఖరున పదవీ విరమణ చేస్తున్న సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ నేతృత్వంలో సంజీవరావుకు శాలువా కప్పి, బొకే అభినందించారు. రాజశేఖర్ మాట్లాడుతూ ప్లాంట్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీగా చేరి జనరల్ మేనేజర్ స్థాయికి ఎదిగిన సంజీవరావు సేవలు నిరుపమానమన్నారు. జీఎం ఎస్. భాను, నాయకులు కారు రమణ, బి.ఎస్. రాజు, పి.వి. రమణమూర్తి, కొమ్ము ప్రసాద్, ప్రభాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


స్టీల్‌ప్లాంట్ హెచ్‌ఆర్ జీఎం సంజీవరావును సత్కరిస్తున్న నాయకులు

1250వ రోజుకు ఉక్కు రిలే దీక్షలు

అగనంపూడి: కేంద్ర ఉక్కు మంత్రి స్టీల్‌ప్లాంట్‌లో పర్యటించినా ప్లాంట్ పరిస్థితి చక్కబడలేదు సరికదా హీన స్థితికి చేరుకుంటుండడం బాధాకరమని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1250వ రోజు, సోమవారం వారు పాల్గొని, మాట్లాడారు. కేంద్ర మంత్రి ప్రభుత్వరంగ సంస్థల జోలికి వెళ్లబోమని ప్రకటించినా, కేంద్ర ప్రభుత్వం వల్ల ఆర్థిక ఇబ్బందుల్లోకి నెట్టబడిన విశాఖ ఉక్కును ఆదుకోడానికి ప్రభుత్వమే చేయూతనివ్వాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వరసాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలి

ఉక్కునగరం: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని స్టీల్‌ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ దివ్యాంగ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఈ అంశంపై సోమవారం ఉక్కు అడ్మిన్ కార్యాలయం కూడలి వద్ద ధర్నా చేశారు. వివిధ కార్మిక సంఘాల నాయకులు పాల్గొని ధర్నాకు మద్దతు తెలిపారు. ధర్నాలో నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రస్తుత గడ్డు పరిస్థితి నుంచి బయట పడటానికి వెంటనే సెయిల్‌లో విలీనం చేయడమే ఉత్తమ పరిష్కారమన్నారు. ధర్నాలో డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, యు.రామస్వామి, కె.ఎస్.ఎన్.రావు, కొమ్మినేని శ్రీనివాస్, దివ్యాంగ ఉద్యోగుల సంఘం నాయకులు పాల్గొన్నారు.



ధర్నాలో పాల్గొన్న నాయకులు

'ఉక్కు' సంక్షోభంపై సదస్సు రేపు

ఉక్కునగరం: 'సంక్షోభంలో విశాఖ ఉక్కు –పరిష్కారం ఎలా ' అనే అంశంపై స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈ నెల 17న నిర్వహిస్తున్న సదస్సు పోస్టర్‌ను యూనియన్ నాయకులు సోమవారం ఆవిష్కరించారు. సెంట్రల్ స్టోర్స్ కూడలి వద్ద జరిగిన కార్యక్రమంలో యూనియన్ నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఎదుర్కొంటున్న సమస్యలపై నిష్ణాతులతో కార్మికులలో అవగాహన, చైతన్యం కలిగించి వారితో సరైన పోరాటాలను నిర్మించడం ధ్యేయంగా ఈ సదస్సు ఏర్పాటు చేశామన్నారు. స్టీల్‌ప్లాంట్ పూర్వ సీఎండీ వై.శివసాగరరావు, సీఐటీయు జాతీయ ప్రధానకార్యదర్శి తపన్ సేన్, జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జె.డి.లక్ష్మీనారాయణ, స్టీల్ వర్కర్స్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి లలిత్ మిశ్రా, సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సిహెచ్. నర్సింగరావు సదస్సులో పాల్గొంటున్నారన్నారు. యూనియన్ గౌరవాధ్యక్షుడు జె.అయోధ్య రామ్, ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి ప్రసంగించారు.

వైభవంగా జగన్నాథుడి బహుదా యాత్ర


ఉక్కులో జగన్నాథుడి రథాన్ని బంగారు చీపురుతో శుభ్రం చేస్తున్న సీఎండీ భట్


పూజలు అందుకుంటున్న సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడు


హౌసింగ్ బోర్డు కాలనీలో జగన్నాథస్వామి రథయాత్రలో మహిళలు, యువతుల కోలాటం

ఉక్కునగరం: ఉక్కునగరంలో జగన్నాథుని బహుదా యాత్ర (తిరుగు యాత్ర)ను సోమవారం వైభవంగా జరిపించారు. రథోత్సవాల్లో భాగంగా సుభద్ర, బలభద్రులతో కలసి ఈ నెల 7వ తేదీన భారీ ఊరేగింపుగా గుండిచ ఆలయానికి చేరుకున్న జగన్నాథుడు తొమ్మిది రోజుల పాటు భక్తుల పూజలందుకున్నారు. అనంతరం స్వామి తిరిగి ఆలయానికి చేరుకునేందుకు తిరుగు రథయాత్ర నిర్వహించారు. ముందుగా గుండిచ ఆలయంలో స్టీల్‌ప్లాంట్ సీఎండీ అతుల్ భట్ దంపతులు జగన్నాథుడికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడి ఉత్సవ విగ్రహాలను రథంపైకి తరలించారు. ఈ సందర్భంగా అతుల్ భట్ సంప్రదాయ దుస్తులు ధరించి, బంగారు చీపురుతో రథాన్ని శుభ్రం చేశారు. అనంతరం పెద్ద ఎత్తున హాజరైన భక్తుల జగన్నాథ స్మరణతో రథాన్ని ఉక్కునగరంలో ఊరేగించారు. కార్యక్రమంలో ఉత్కళ్ కల్చరల్ అసోసియేషన్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

మార్మోగిన జగన్నాథ స్మరణ

పెదగంట్యాడ: జగన్నాథస్వామి స్వామి మారు రథయాత్రను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో గల జగన్నాథస్వామి ఆలయంలో నీలాచల్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బలభద్ర, సుభద్ర సమేత జగన్నాథ స్వామి ఉత్సవ విగ్రహాలను రథంపై కొలువుదీర్చి రథయాత్ర నిర్వహించారు. హౌసింగ్ బోర్డు కాలనీలోని జగన్నాథ స్వామి ఆలయం నుంచి సాయంత్రం 5 గంటలకు ఈ యాత్ర ప్రారంభమైంది. మేళతాళాలు, కోలాటం నడుమ కొరాడ, బాలచెరువు, నెల్లిముక్కు, అయ్యన్నపాలెం మీదుగా ఆలయం వరకు ఈ యాత్ర సాగింది. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామి వారిని దర్శించుకుని, పూజలు చేశారు.

అగనంపూడిలో నేడు..

అగనంపూడి: జగన్నాథుడి తిరుగు రథోత్సవం మంగళవారం సాయంత్రం నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. అగనంపూడిలోని ఇంద్రద్యుమ్న హాల్లో దశావతారాల్లో దర్శనమిచ్చిన స్వామిని తిరిగి ఆలయానికి భారీ ఊరేగింపుగా తీసుకువెళతామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. దశావతారాల్లో భాగంగా జగన్నాథుడిని సోమవారం బుద్ధావతారంలో అలంకరించి భక్తులకు దర్శనాలు కల్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరణం పైడిరాజు, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అభివృద్ధి పనుల పరిశీలన

పెదగంట్యాడ: జీవీఎంసీ 73వ వార్డు పరిధి వుడాకాలనీలో 20 లక్షల రూపాయలతో చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను కార్పొరేటర్ భూపతిరాజు సుజాత సోమవారం పరిశీలించారు. పనుల పురోగతిపై ఆరా తీశారు. నాణ్యత విషయంలో రాజీ పడవద్దని సిబ్బందికి సూచించారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి రోడ్డును వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో వుడాకాలనీ అధ్యక్షుడు గొరుసు సత్యం తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి టీవీ బహూకరణ

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రానికి స్థానిక వెంకటేశ్వర కాలనీకి చెందిన లాలం వినోద్ కుమార్ 55 అంగుళాల ఎల్‌ఈడీ టీవీని బహూకరించారు. కుటుంబ సభ్యులతో కలసి స్వామిని సోమవారం దర్శించుకున్న అనంతరం, టీవీని అర్చకులకు అందజేశారు.

'సర్వహిత' వితరణ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిరుపేద కుటుంబానికి పింఛన్‌తో పాటు నెలకు సరిపడా బియ్యం, ఇతర వంట సామగ్రి అందించారు.సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.బోసుబాబు, కార్యదర్శి భాస్కరరావు చేతులమీదుగా వీటిని అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.మస్తాన్‌రెడ్డి, ప్రతినిధులు పాల్గొన్నారు.

18న ద్విచక్ర వాహనాల వేలం

గాజువాక: స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో 37 అన్‌క్లెయిమ్డ్ ద్విచక్ర వాహనాలకు ఈనెల 18న వేలం వేయనున్నట్టు గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి తెలిపారు. ఈ ప్రక్రియ స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్‌లో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

విజయకుమార్‌కు విశిష్ట మెజీషియన్ బిరుదు


ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ విశ్రాంత అధికారి కొల్లాబత్తుల విజయకుమార్‌కు విశిష్ట మెజీషియన్ బిరుదును ప్రదానం చేశారు. 40వ ఇంద్రజాల మహోత్సవం సందర్భంగా ఏపీ మెజీషియన్స్ అసోసియేషన్ (ఏపీఎంఏ) ఆధ్వర్యంలో గుంటూరులో నిర్వహించిన అమరావతి మ్యాజిక్ ఫెస్టివల్‌లో ఆయన్ను సత్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు జె.వి.రావు, కార్యదర్శి ఆర్యల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మంగరాజుకు ఘన సన్మానం


మంగరాజును సత్కరిస్తున్న నాయకులు

గాజువాక : కేంబ్రిడ్జి డిజిటల్ యూనివర్సిటీ నుంచి ఇటీవల డాక్టరేట్‌ను అందుకున్న గాజువాక వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం నాయకుడు కులుకూరి మంగరాజును ఆర్య వైశ్య సంఘాల నాయకులు సోమవారం ఘనంగా సత్కరించారు. స్థానిక వాసవీ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంఘం నాయకులు ఆయన్ను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు నంబూరు జగన్నాథరావు, కేశారపు శ్రీను రమేష్, టాబు సతీష్, గుండా శరత్ చంద్ర గుప్త, పి.పి.ఎస్.నాగేశ్వరరావు, కేశారపు సతీష్, బొడ్డు కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మంత్రులకు సత్కారం


మంత్రులను సత్కరిస్తున్న కరణంరెడ్డి

గాజువాక: కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాసవర్మ, రాష్ట్ర ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్‌లను గాజువాక బీజేపీ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు సోమవారం సత్కరించారు. విశాఖ పర్యటనలో ఉన్న మంత్రులను తన సహచర నాయకులతో కలిసి విశాఖ ఎయిర్‌పోర్టులో కలిసి, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గూటూరు శంకరరావు, బొత్స దిలీప్ తదితరులున్నారు.

లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక

గాజువాక: గాజువాక లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. 2024–25 సంవత్సరానికి అధ్యక్ష కార్యదర్శులుగా సత్యాల కోటేశ్వరరావు, పాలిశెట్టి లక్ష్మణ్, కోశాధికారిగా బలివాడ సత్యారావు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు ఆలపాటి సుబ్బారావు, అచ్యుతరావు, చిక్కా సత్యనారాయణ, నున్న శ్రీనివాసరావు, వీరయ్య, డాక్టర్ శేషప్రసాద్, జైరాం, శ్రీధర్, మంత్రి జగన్నాథరావు తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ ఆస్పత్రికి రూ.2 లక్షల విరాళం

ఈ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ సభ్యులు విరాళాలను అందించారు. లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రికి కొమ్మారెడ్డి నాగభూషణరావు రూ.2 లక్షల విరాళాన్ని అందజేశారు. ఒక పేద విద్యార్థి చదువుకు అయ్యే ఖర్చు మొత్తం భరిస్తూ న్యాయవాది వెన్నల ఈశ్వరరావు 10వేల రూపాయలను అందించారు.


పేద విద్యార్థికి సాయం అందిస్తున్న ప్రతినిధులు